క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధి అంతారం గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమి పూజ చేశారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని గ్రామ పెద్దలు తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్‌ఐ భరత్‌రెడ్డి

కొడంగల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ భరత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై సలహాలు సూచనలు ఇచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమని, అతివేగం ప్రాణాలను తీస్తుందని హెచ్చరించారు.

విద్యార్థినికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నవనీత

కొడంగల్: పట్టణానికి చెందిన కానుకుర్తి నవనీతకు శనివారం రాత్రి నిజామాబాద్‌లో జరిగిన కాన్వకేషన్‌లో డాక్టరేట్ పొందారు. మేఘన ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో ఆమె బీడీఎస్ (బ్యాచలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) పూర్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రతాప్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి ఆమెకు పట్టా ప్రదానం చేశారు. దీంతో యువతి తల్లిదండ్రులు లక్ష్మీ, కానుకుర్తి నర్సింలు ఆనందం వ్యక్తంచేశారు.

సత్వర న్యాయంతో సమగ్రాభివృద్ధి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డి

అనంతగిరి/తాండూరు టౌన్: సత్వర న్యాయంతో సమగ్రాభివృద్ధి సాధ్యమని చేవెళ్ల పార్లమెంటు స్వతంత్ర్య అభ్యర్థి ఈసరి సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వికారాబాద్ పట్టణం, తాండూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో అవినీతి, స్వార్థం పెరిగి పోయిందని, వాటిని సమూలంగా నిర్మూలించి, దేశ ప్రగతికి పాటుపడతానని పేర్కొన్నారు. ఇంజినీర్‌గా ఎన్నో సేవలు అందిస్తున్నాని, అవకాశం ఇస్తే.. టెక్నాలజీకి అనుగుణంగా పల్లెలను తీర్చిదిద్దుతానని, అనేక సేవలను అందుబాటులోకి తెస్తానని వెల్లడించారు. ఇందులో సురేష్, ఆదిత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక వికాసం



అవగాహన కల్పిస్తున్న సొసైటీ కోఆర్డినేటర్లు

కుల్కచర్ల: ధ్యానంతో మానసిక వికాసం లభిస్తుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్ల ఆంజనేయరెడ్డి, ప్రచారకర్త నవీన్ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం చెల్లాపూర్ గ్రామస్తులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడారు. నిత్య ధాన్యంతో మానసిన ప్రశాంతతో పాటు, ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. అంతే కాకుండా బీపీ, షుగర్ లాంటి వ్యాధులు దరిచేరవని తెలిపారు.

వడ్డీ వ్యాపారి బాధితుడికి సాయం

తాండూరు టౌన్: అప్పు తీసుకుని వడ్డీ చెల్లించలేదని వడ్డీ వ్యాపారి చేతిలో దాడికి గురైన బాధితునికి అంబేడ్కర్ పారా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ శివానంద్ సింగ్ ఠాకూర్ ఆదివారం రూ.5వేలు ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలో ఓ వ్యాపారి, వడ్డీ కోసం ఆటో డ్రైవర్ బాలప్పను చితకబాదిన విషయం విధితమే. ఈ మేరకు బాధితునిపై పలువురు సానుభూతి వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలను తీవ్రంగా వ్యతిరేకించాలని శివానంద్ కోరారు.

నిలువెల్లా నిర్లక్ష్యం



అసంపూర్తి నిర్మాణంలో పట్టణ గ్రంథాలయ భవనం

పదిహేనేళ్లుగా పూర్తికాని లైబ్రరీ భవన నిర్మాణం

- పాతభవనంలో పాఠకుల ఇక్కట్లు
- కనీస వసతులు లేక నిరుద్యోగుల నిరీక్షణ
- పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు పాట్లు

సర్కారు కొలువుల కోసం నిరుద్యోగులు ఏళ్ల తరబడి ఎదురు చూశారు. ఎప్పటికైనా ఉద్యోగం సాధించకపోతానా అనే పట్టుదలతో ఉన్నారు. చీకట్లో చిరుదివ్వెలా.. వారి జీవితాల్లో వెలుగులు నింపుతూ.. ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ చేసింది. కానీ.. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేందుకు సరైన వేదిక కరువైంది. ఉన్న లైబ్రరీ చిన్నదైంది. కొత్తది వినియోగంలోకి రాకముందే పాతదైంది! దీంతో దిక్కులు చూడటం వారి వంతయింది.

తాండూరు టౌన్: దశాబ్ద కాలంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు తాండూరు పట్టణంలో చదువుకోవడానికి కనీస వసతులు కరువయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే పలు విభాగాల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి పచ్చజెండా ఊపింది. దీంతో పోటీ పడుతున్న అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే గ్రామీణ ప్రాంత యువత, ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు పల్లెల్లో సరైన వసతులు లేకపోవడంతో.. తాండూరు నియోజకవర్గ పరిధి గ్రామాల నుంచి నిరుద్యోగ యువతీ, యువకులు పట్టణంలోని గ్రంథాలయం బాట పడుతున్నారు. ప్రతి రోజు 120 మందికి పైగా ఇక్కడికి వస్తుంటారు. అరకొర వసతుల మధ్య గ్రూప్స్, డీఎస్సీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. అయితే లైబ్రరీలో కేవలం రెండు గదులు మాత్రమే ఉండటం, దిన పత్రికలు చదివేందుకు వచ్చే పాఠకులతో కిక్కిరిసి పోతోంది. దీంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇది ఇబ్బందిగా మారింది.

అది పూర్తికాలేదు.. ఇది కార్యరూపం దాల్చలేదు



పాత భవనంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు

పాత గ్రంథాలయం భవనం వెనుక భాగంలో 15 ఏళ్ల క్రితం నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఆ భవనం నేటికీ పూర్తి కాలేదు. పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ఏడాది క్రితం నాటి మంత్రి హరీశ్‌రావు శిలాఫలకం వేశారు. అయినప్పటికీ అదీ కార్యరూపం దాల్చలేదు. అసంపూర్తి పనులతో నిలిచిన కొత్త భవనంలో అయినా, తగిన సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తెస్తే.. ఉపయోగకరంగా ఉంటుందని పాఠకులు కోరుతున్నారు.

చందాలు వేసుకుని..



పోటీ పరీక్షలకు సన్నద్ధమవ్వడానికి గ్రంథాలయానికి అనేక మంది నిరుద్యోగులు, వారితో పాటు దినపత్రికలు, తదితర పుస్తకాలు చదివేందుకు పాఠకులు వస్తుంటారు. ఇందుకు ప్రస్తుత పాత లైబ్రరి భవనం సరిపోవడం లేదు. అసంపూర్తి నిర్మాణంతో ఆగిన భవనంలో సౌకర్యాలు సమకూర్చుకునేందుకు తలా రూ.250 చొప్పున చందాలు వేసుకుంటున్నాం. ఆర్బీఎల్ సంస్థ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి రూ.20వేలు సాయం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తగిన సౌకర్యాలతో కూడిన భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

– కృష్ణ, తాండూరు

చల్లని నేస్తాలు వచ్చేశాయి

- పేదోడి ఫ్రిజ్‌లకు భలే గిరాకీ



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టికుండలు

దౌల్తాబాద్: ఎండాకాలం వచ్చేసింది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ.. ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జనాలు వేసవి తాపంతో అల్లాడుతూ.. రోడ్డు పైకి రావాలంటే జంకుతున్నారు. మధ్నాహ్నం 12గంటలకే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి నేస్తాలైన కూలర్లు, ఫ్రిజ్‌లు, మట్టి కుండలు కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే చలి గాలి నిచ్చే ఏసీల సంగతి ఎలా ఉన్నా.. కొత్త కుండలోని చల్లటి నీరు తాగేందుకు అత్యధులు ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా ఫ్రిజ్‌లు కొనేంత స్థోమత లేనివారు.. పేదోడి ఫ్రిజ్‌లుగా ఖ్యాతిపొందిన మట్టి కూజలు కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. దీంతో వాటి విక్రయాలు ఊపందుకున్నాయి. కనిష్టంగా రూ.100 నుంచి గరిష్టంగా 300లు ఆపై ధరలకు కుండలు విక్రయిస్తున్నట్లు తయారీదారులు చెబుతున్నారు. ఇక స్థానికంగా తయారైన కూలర్లు రూ.2500 నుంచి రూ.5వేలకు పలుకుతున్నట్లు సమాచారం.

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీకే సాధ్యమని ఆ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బంధయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ఆధ్వర్యంలో దేశం ఎనలేని అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, లోక్‌సభ ఎన్నికల్లో మోదీ హ్యాట్రిక్ విజయం, చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీమోర్చా కార్యదర్శి శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మాసయ్య, నాయకులు పురుషోత్తం, జనార్దన్, వెంకటేశం, మైపాల్, రాజేందర్ రెడ్డి, నరేష్, శ్రీను, రాము, శివకుమార్, సంతోష్, చెన్నప్ప, నర్సింలు, రవి, చెన్నప్ప, ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలను పాటించండి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధలను పాటించాలని ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి అన్నారు. ఆదివారం చౌడాపూర్ గ్రామ పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు అన్ని ధృవపత్రాలను తమ వెంటే ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనలకు ఇవ్వరాదని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు, బంగారం తరలిస్తున్నట్లు అయితే.. వాటికి సంబంధించిన ఆధారాలు వెంటే ఉండాలని పేర్కొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌నాయక్

షాద్‌నగర్: కరాటే, కుంగ్‌ఫూ లాంటి యుద్ధ విద్యలు ఆత్మరక్షణకు ఎంతో దోహదడతాయని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బృందావన్ కాలనీలో న్యూ మాంక్స్ కుంగ్ ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, తననుతాను కాపాడుకోవడానికి యుద్ధ విద్యలు నేర్చుకోవడం అంతే ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మరక్షణ కోసం విధిగా కరాటే, కుంగ్‌ఫూ లాంటి విద్యలను నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు యుద్ధ విద్యల్లో విధిగా శిక్షణ ఇప్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ మాస్టర్ నక్క బాల్‌రాజ్, కౌన్సిలర్ లతాశ్రీశైలంగౌడ్, శ్రీనివాస్‌యాదవ్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. మృత్యుపిలుపులు

- కానరాని సూచికలు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బిచ్చాల రోడ్డులో మలుపు



తిమ్మారెడ్డిపల్లి వద్ద..

దౌల్తాబాద్: మూలమలుపులు.. మృత్యువు పిలుపులుగా మారాయి. కనీసం సూచిక బోర్డులు లేకపోవడంతో ఆ ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా గుర్తింపు పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రభుత్వం బీటీరోడ్లను నిర్మిస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా.. అత్యధికంగా, ఊహించని మలుపులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఆ రహదారుల్లో ప్రయాణించే వారు సైతం భయాందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎలాంటి సూచికలు బోర్డులు లేవని, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయని వాపోతున్నారు. ప్రమాదపుటంచుల్లో ప్రయాణిస్తున్నామని, సంబంధిత అధికారులు స్పందించి గైడ్‌వాల్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మలుపులు ఇవే..

మండల పరిధి గోకఫసల్‌వాద్ నుంచి తిమ్మారెడ్డిపల్లి మీదుగా బాలంపేట వరకు సుమారు 5 కిలో మీటర్ల రోడ్డులో అధిక మలుపులు ఉన్నాయి. కుదురుమళ్ల బీటీరోడ్డు నుంచి హస్నాబాద్ వరకు 3కి.మీ., దౌల్తాబాద్ నుంచి కోస్గి వరకు 18 కి.మీ. దూరంలో అనేక మలుపులతో రోడ్డు ఉంది. దేవర్‌ఫసల్‌వాద్ నుంచి సుల్తాన్‌పూర్, దౌల్తాబాద్ నుంచి గుముడాల మీదుగా తిమ్మాయిపల్లి, బిచ్చాల గ్రామాల వరకు ఎక్కువ మలుపులు ఉన్నాయి.

పని చేసినా పైసలేవీ?

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- ఎండలోనే పనులు.. నిలిచిపోయిన సౌకర్యాలు
- వసతులు కల్పించాలని విజ్ఞప్తి



బొబ్బిలిగ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

షాబాద్: గ్రామాల్లో వలసల నివారణకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. పనులు చేసే చోట సదుపాయాల సంగతి దేవుడెరుగు.. కనీసం చేసిన పనికి కూలీ డబ్బులు కూడా అందడం లేదు. ఏటా వేసవిలో అందించే అదనపు అలవెన్స్‌లు సైతం నిలిపివేశారు. అదేవిధంగా ఎండలు మండుతుండడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశంలో సెదతీరేందుకు టెంట్లు ఏర్పాటు చేయలేదు. తాగునీరు సౌకర్యం కల్పించడం లేదు. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నట్లు కూలీలు తెలిపారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం 14 రోజుల్లో చేసిన పనికి కూలీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ మూడు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో అర్ధాకలితో పనులు చేయలేక పోతున్నామని కూలీలు వాపోతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు. ఉపాధి పనులకు రండి అని ఈజీఎస్ అధికారులు బతిమిలాడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

8,500 మందికి జాబ్‌కార్డులు..

మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో మొత్తం 8,500 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు 700 మంది కూలీలు ఉపాధి పనులను ఉపయోగించుకుంటున్నారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలకు కొన్నేళ్లుగా మెడికల్ కిట్లు అందడం లేదు. పారలు, గడ్డపారలు కొన్నేళ్ల క్రితం ఇచ్చినా.. అవి కూడా నిలిపివేశారు. నాలుగైదు ఏళ్లుగా భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో కూలీలు వ్యవసాయ పనులకు వెళ్తూ.. ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ పనులు కూడా తగ్గాయి. అయినా కూలీలు సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని ఉపాధి పనులకు వచ్చేందుకు ఇష్టపడటం లేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు దినసరి కూలీ రూ.272 నిర్ణయించింది. మండలంలో పలు గ్రామాల్లో వందలాది మంది కూలీలు ఉన్నా ఉపాధి పనులకు వచ్చేందుకు ముఖం చాటేస్తున్నారు.

సకాలంలో అందేలా చూస్తాం



గ్రామాల్లో ఉపాధి కూలీలకు సరిపడా పనులు గుర్తించాము. పనులకు రావాలని కూలీలను అడుగుతున్నాం. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని ప్రస్తుతం మండలంలో 700 మంది కూలీలే పనులకు వస్తున్నారు. మరో వారంలో రెండు, మూడు వందల మంది కూలీలు పనులకు వచ్చే అవకాశం ఉంది. పెండింగ్ బిల్లులు సకాలంలో అందేలా చేస్తాం.

– వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

వేతనాలు అందడం లేదు



పనులు చేస్తున్నా తమకు వేతనాలు సరైన సమయంలో కూలీ చెల్లించడం లేదు. జనవరిలో ఉపాధి పనులకు వెళ్లాం. కానీ ఇప్పటివరకు ఆ పనులకు సంబంధించిన వేతనాలు రాలేదు. ఇంట్లో ఖర్చులు, ఇతర అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నాం.

– నర్సింహులు, కూలీ, బొబ్బిలిగామ

వైద్య సదుపాయాలు కల్పించండి



ప్రస్తుతం వేసవి ప్రారంభమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులు చేస్తున్నాం. కూలీలు వడదెబ్బకు గురైతే వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో లేవు. గ్రామాల్లో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలు.. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి వెళ్తున్నారు.

– నీలమ్మ, కూలీ, బొబ్బిలిగామ

వసతులు కల్పించాలి



ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థలాల్లో కూలీలకు కనీస సరైన వసతులు లేవు. గ్రామంలో కోపుల పనులు చేస్తున్నాం. ఇంతకు ముందు నీడ కోసం కవర్లు ఏర్పాటు చేసేవారు. పల్లెల్లో ఉదయం 7 గంటలకే పనులకు వెళ్లి 11:30 గంటలకు ఇంటికి చేరుతున్నాం.

–జంగయ్య, కూలీ బొబ్బిలిగామ

పాఠశాలకు 'సోలార్' వెలుగులు



పాఠశాలపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు



దాత సచిన్‌సిగవన్, తదితరులను సన్మానించిన గ్రామస్తులు

విద్యుత్ సౌకర్యం కల్పించిన ప్రముఖ సంస్థ

మర్పల్లి: విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో మగ్గుతున్న ప్రాథమిక పాఠశాలకు దాతలు.. సోలార్ సిస్టంతో వెలుగునిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలపల్లి గ్రామానికి చెందిన రాజమౌళి తదితరుల ద్వారా పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేదన్న విషయాన్ని హైదరాబాద్‌లోని ప్రముఖ సంస్థ శీరో ఫార్మాలిమిటెడ్-గ్రీన్ ఇండియా తెలుసుకుంది. రూ.4.50 లక్షలతో పాఠశాల భవనంపై 4 సోలార్ పలకలు ఏర్పాటు చేయించగా.. శనివారం కంపెనీ ఎండీ సచిన్‌సిగవన్ ప్రారంభించి, విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించారు. అనంతరం ఎండీ మాట్లాడారు. తమ కంపనీకి వచ్చిన లాభాలతో ఏటా 2 గ్రామాలను ఎంపిక చేసుకుని, సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఉపాధ్యాయులు, గ్రామస్తులు సచిన్, సంస్థ సిబ్బందిని సన్మానించారు. బడికి విద్యుత్ సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు సంతోసం వ్యక్తంచేశారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు నిధులివ్వండి



ఎమ్మెల్యేతో బెల్కటూర్ గ్రామస్తులు

తాండూరు రూరల్: ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బెల్కటూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం తాండూరులోని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గ్రామంలో శ్మశానవాటికకు భూమి కేటాయించాలని, అదే విధంగా రేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నర్సింలు, వెంకటేశ్, జగ్గప్ప, సైదప్ప, నర్సప్ప, శ్యామప్ప తదితరులు ఉన్నారు.



అనంతగిరి: శ్రీ సాయినగర్‌లో ఆదివారం రాత్రి కాముని దహనం చేస్తున్న కాలనీ వాసులు